# జీవన ప్రహసనం

"ఈరోజు కథ-ఆహా, ఏం జెప్పాదు సామీ! వింటా వింటా జనమంతా అట్టనే బొమ్మలైపోయినారనుకోండి!" అన్నాడు పినపెద్ద వెంకటాద్రినాయుడు.

"అవునా! అట్లాగా? అంత బాగుందా?" అన్నారు హరినారాయణశర్మ భాగవతారుగారు.


"మెల్లిగా అడగొద్దండి సామీ! మాట మాటా వజ్జరపు తునక మాదిరిగా రాలిపోయిందనుకోండి! నేను మెరమెచ్చుల కోసరం యిట్లా చెప్తావుండా ననుకుంటారేమో! ద్రవుప దమ్మమీదొట్టు. అదేం లేదు. నా హయాంలో యిది యిరవైరెండో భారతం. నాకు దెల్సి రాజసూయం జెప్పినో ళ్ళుండారు. వస్త్రాపహర్ణం చెప్పినోళ్ళుండారు. విషనీళ్ళు చెప్పినోళ్ళుండారు. అయితే పాచికలాటను పట్టుకోని యింత పట్టుగా, పసందుగా చెప్పినోళ్ళెవురూ లేరు..."

"మంచిదయ్యా నాయుడూ! నాకేమో ఆదినుంచీ బెరుకు బెరుగ్గానే వుంది. ఎందుకంటే మాట్లాడ్డంలో మా యాసవేరు. మీ యాస వేరు. నా ప్రసంగం ఈవైపు వాళ్ళకి అర్థం గాకపోతే ఎంత గొంతు జించుకుని ఏం లాభం? పోనీలే, నువ్వు నీ మనసులోని మాట చెప్పేశావుగనుక నాకిప్పుడు ఏనుగెక్కినంత సంబరంగా వుంది. అయితే పాచికలాటను గురించి యింతగా నొక్కి చెప్పడం నీకు కాస్త ఆశ్చర్యంగానే వుండొచ్చు. అందుకు నా కారణాలు నాకున్నా యిలే! చెబుతానుగానీ, నువ్విలా కూచో. నేను పెరట్లోకి వెళ్ళి కాస్త పాద ప్రక్షాళనం అదీ కావించుకొచ్చేస్తాను."

"అట్టనే సామీ!" అంటూ వెంకటాద్రినాయుడు నడవలోని కుర్చీలో కూర్చున్నాడు. జరీ కండువా వంకీకి తగిలించి, పట్టు పీతాంబరం విప్పి మామూలు పంచె కట్టుకుని హరి నారాయణ శర్మగారు పెరట్లోకి వెళ్ళారు.

ఎండల వూపు హెచ్చి, బావుల్లో నీటి మట్టం క్రుంగి, చెట్లన్నీ ఆకులు రాల్చుకుని, రైతులు ముంగారు వానలకోసం ఎదురు చూచే రోజుల్లో మహా భారత యజ్ఞాలు జరగడం మామూలు. అపరాహ్ణాల్లో 'పగటి కథ', రాత్రుల్లో వీథి నాటకం. భారత యుద్ధంలా యిదీ పద్దెనిమిది రోజుల తతంగం! అయితే ఒకటి. భారత కథ ఎవరికి తెలియదని? అక్షరమ్ముక్కరాని అవ్వనడిగినా చెబుతుంది. జాతి జీవనంలో జీర్ణించిపోయి, ఆబాల గోపాలానికీ సుపరిచితమైన ఒక పురాణ గాథను మళ్ళీ ఒకసారి చెప్పి శ్రోతల్ని మెప్పించాలంటే, ఆ వ్యక్తి ఎలాంటి వాడై వుండాలి? పాండిత్యం, లోకజ్ఞత, సమయస్ఫూర్తి, సంగీతంలో అభినివేశం, హాస్య చతురత మొదలుగాగల అర్హతలెన్నో కలిగి వుండాలి. మీదు మిక్కిలి ధర్మ సందేహాలు నివారించడం, ధర్మ సూక్ష్మాలు వివరించడం చాలా ముఖ్యం. అలాంటి భాగవతారు కోసం వాకబు చేస్తూ రావడంలో తొలిసారిగా హరినారాయణశర్మగారి పేరు వెంకటాద్రినాయుడి చెవిలో పడింది. అయినా నిగ్గదీస్తేగాని నిజం తెలియదు గదా! అందుకని 'ఓయబ్బ! నేనింతప్పటి నుంచీ భారత పురాణాలు వింటానే వుంటిని. ఏర్పేడు సుబ్బరామ దాసుకన్నానా? సంతపేట తిరువేంగడ దాసు కన్నానా? సోంపల్లి సూర్నారాయణ శాస్త్రుల్లకంటేనా? నువ్వు చెప్పే ఆయన వాళ్ళకంటే ఏం పొడిచేసినాడో?' అంటూ ముదలంకించుకున్నాడు నాయుడు. అవతలి వ్యక్తి కప్పుడు తన డిపాజిట్టు నిలుపుకోవలసిన అవసరం ఏర్పడింది. 'చూడయ్యా నాయుడూ! హరి నారాయణ శర్మగారు నాకేమైనా చుట్టమా! కాదే! కాని చెక్కెర తిని చేద నొచ్చునా? అందుకని జెప్పినానేగానీ, ఆయన తరపున వకాలత్తు పుచ్చుకోవలసిన పని నాకేముంది? అయినా మల్‌గూబా మామిడిపండు మాధుర్యాన్ని వర్ణించి ఏం లాభం? ఒకసారి తినిచూస్తే తెలుస్తుంది. నువ్వెప్పుడైనా ఆదిభట్ల నారాయణదాసు పేరు విన్నావా? హరికథా పితామహుడని ఆయనకు బిరుదు. ఆయన మీసాలు పెంచిన హరిదాసు. మరైతే శర్మగారేమో మీసాలులేని ఆదిభట్ల నారాయణదాసు. ఇదీ సంగ్రహంగా ఆయన పరిచయం. మరింత వివరంగా చెప్పమంటావేమో! నేనందుకూ సిద్ధమే! హరినారాయణ శర్మగారు గండ పెండేరాలు తొడుక్కోడు. సింహతలాటపు మురుగులు వేసుకోడు. వ్రేళ్ళ వ్రేళ్ళకీ ఉంగరాలు పెట్టుకోడు. మరైతే అలాంటి ఆభరణాలు ఆయనకు లేవనుకోవద్దు. కాదంటే ఆయన తనవైన బిరుదులు, అలంకారాలు అన్నింటినీ కట్టగట్టి అటకమీద పారేశాడు. చూడ్డానికి ఆయన చాలా సామాన్యంగా పిచ్చి బ్రాహ్మడిలా వుంటాడు. మునుపటికెవరో ఇంద్రజాలికుడు పిల్లన గ్రోవి ఊదితే పిల్లలందరూ అతడి వెంట వెళ్ళిపోయినారట! శర్మగారు గొంతు విప్పితే సభికుల పరిస్థితీ అంతే! ఇదంతా నీకెట్లా తెలిసిందని అడుగుతావేమో! పసుపు కొనుగోలు కోసరమని నేను పల్నాడు వెళ్ళివుండే, ఒక రాత్రి వినుకొండలో బసచేసినాను. ఆ రోజు రాత్రి హరికథ వుందని ఎవరో చెప్తే, వెళ్ళి సభలో కూర్చున్నాను. నిర్వాహకులు శర్మగారిని కొంచెం పట్టిచూడాలనుకున్నారేమో, సీతా కల్యాణాన్ని శోక రస ప్రధానంగా చెప్పమని అడిగినారు. 'సీతా కల్యాణంలో శోక రసమా! ఇదేం చోద్యమబ్బా' అని అందరూ ఆశ్చర్యపడిపోయినారు. శర్మగారేం చేసినాడనుకున్నావు? జనకుడు సీతమ్మకు పెండ్లిచేసి, అత్తవారింటికి సాగనంపే ఘట్టాన్ని అందిపుచ్చుకున్నాడు. గుండెల్ని పిండేసినాడనుకో! ఏడవని వాళ్ళు పాపాత్ములు!'

వెంకటాద్రి నాయుడిది ఉడుము పట్టు. అనుకున్న పని నెరవేరితేగానీ అతనికి నిద్ర పట్టదు. మాజీ మునసబు అప్పాజీ రెడ్డిని వెంట బెట్టుకుని, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి వెళ్ళి ఒకనాటి తెల్లవారు జామున అతడు విజయవాడ స్టేషన్లో దిగాడు. అక్కడినుంచి బస్సులో గుడ్ల వల్లేరు చేరుకున్నాడు. గుడ్ల వల్లేరుకు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న ఒక చిన్న గ్రామం హరి నారాయణ శర్మగారి స్వస్థలం. తీరా అక్కడికి వెళ్ళిన తర్వాత ఆయన ఊళ్ళో లేడనీ, అన్నవరం సత్యనారాయణస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన ప్రోగ్రాం ఏర్పాటైందనీ తెలిసింది. 'ఏమయ్యా అప్పాజీ! సామి వూళ్ళో లేడంటనే! ఇప్పుడేం జేతామంటావు?' అని నాయుడు మిత్రుణ్ణి సలహా అడిగాడు. 'దాందేముంది వెంకటాద్రన్నా! ఆ అన్నవర మెక్కడుందో తెలుసుకుంటే పోలా! ఇంత దూరమొచ్చినాక యిప్పుడింక వెనకడుగేస్తామా?' అన్నాడు అప్పాజీరెడ్డి. మళ్ళీ రైలెక్కి అన్నవరంలో దిగారు. ఏడు రోజుల హరికథల ప్రోగ్రాంలో



## మధురాంతకం రాజారాం

అప్పటికి నాలుగు రోజులు ముగిశాయి. ఇంకా మూడు రాత్రుల కథ బాకీ వుంది. 'ఏమప్పాజీ! ఇక్కడ కొండ, గుడీ, ఊరూ, చెరువూ అన్నీ బాగుండాయి. మూడు రోజులుండిపోయి కథ విందామా?' అన్నాడు నాయుడు. 'ఉండే. పోయింది. పొద్దు పొడిస్తే, పొద్దు పోతే దేవుణ్ణి జూడొచ్చు. రాత్రుల్లో కతావినొచ్చు. అంత కంటే భాగ్యమా' అంటూ బలపరిచాడు రెడ్డి. ఆ మూడు రోజులూ వాళ్ళపాలిటికి మూడు క్షణాల్లా దొర్లిపోయాయి. చివరి రాత్రి కథ ముగించడానికి మునుపు మంగళం పాడి శర్మగారు స్టేజి దిగబోతుండగా అప్పాజీ రెడ్డిని వెంట బెట్టుకున్న వెంకటాద్రి నాయుడు చరచరా ముందుకు వెళ్ళి, ఆయన కెదురుగానిలబడి రెండు చేతులూ ముందుకు సాచాడు. 'ఏమిటయ్యా యిది?' అన్నారు శర్మగారు. నుదుట తీర్చి దిద్దిన తిరునామాలతో, బొద్దు మీసాలతో, వెండి పొన్నుగర్రతో, చెంగులు పైకొచ్చేటట్టుగా ఎత్తి కట్టుకున్న పంచెపైన పొడుగుచేతుల చొక్కా తొడుక్కున్న వెంకటాద్రి నాయుడు ఆయన కళ్ళకు చిత్రమైన వ్యక్తిలా కనిపించాడు. 'చెప్తానంటిని గదా! తమరు తీసుకోండి సామీ!' అంటూ ప్రాధేయపడిపోతున్నాడు నాయుడు. శర్మగారు యాంత్రికంగానే అందుకున్నారు. 'తాంబూలమా! డబ్బు గూడాపెట్టి యిచ్చావా? ఓరి పిచ్చోడా! ఎందుకయ్యా యిది?' అంటూ విస్తుపడిపోయారు. 'మనవి చేస్తాను సామీ!' అంటూ గొంతు సవరించుకున్నాడు నాయుడు. 'మాది సామీ రాయల సీమలో చిత్తూరు జిల్లా. తిరుపతికి పడమరగా పదహైదు మైళ్ళల్లో బుగ్గ అగ్రహారం. నా పేరు వెంకటాద్రినాయుడు. ఆయన అప్పాజీ రెడ్డి. మావూళ్ళో ధర్మరాజులవారి గుడుంది. ప్రతి సమ్మత్సరమూ మహా భారత యజ్ఞం జరిపిస్తాము. పగటిపూట పురాణం. రాత్రుళ్లో వీథి నాటకం. ఈసారి కత ఎవురి దగ్గిర చెప్పిస్తామా అని ఆలోచిస్తా వుంటిమి. ఎట్లనోగానిపోదిడిగా మీ మాట మా చెవిలో పడింది. ఏకాయెకిని బయల్దేరి మీ వూరికొస్తిమి. అక్కడికొచ్చినాక మీరిక్కడున్నట్టు తెలిసింది. ఇక్కడికొచ్చి మూడు రోజులాయె. వచ్చినందుకు గుళ్ళో దేవుణ్ణి చూస్తిమి. మంటపంలో మీ కతా వింటిమి. నా కొచ్చిన చదువు స్వల్పం. మిమ్మల్ని గురించి చెప్పగలిగి నంతటోణ్ణి గాదు. మీరోసారి భారతానికి మావూరు రావాల. కొండంత దేవుడికి కొండంత పత్రి ఎయ్యలేము. ఏదో మా శక్తి, మా భక్తి! మీ కతను మేమ్మాత్రం వింటే సాలదు, మా పక్కోళ్ళందరూ వినాల. ఇదే సామీ నా యిన్నపం!' అంటూ చేతులు జోడించాడు.


వెంకటాద్రి నాయుడి వాలకం, అతడు విషయాన్ని ప్రస్తావించిన తీరు, చేసిన అభ్యర్థన శర్మగారికి ఎంతో వింతగావుండిపోయాయి. ఆయన అతడి భుజంపైన చెయ్యివేసి 'భలే వాడివయ్యా నాయుడూ! మెల్లిమెల్లిగానే ముంగాళ్ళకు బంధం వేసేశావే! సత్యనారాయణ స్వామి కోవెలలో చేతి కొచ్చిన తాంబూలం, వద్దనడానికి మనసొప్పడం లేదు. అయితే నేను కథల కోసం నెల్లూరు దాటి అటువైపు వచ్చిన వాణ్ణి గాను. మీ సాంప్రదాయాలెలా వుంటాయో ఏమిటో! మాటల తీరులో మీకూ, మాకూ కొట్టొచ్చినట్టుగా తేడా కనిపిస్తుంది. నా పురాణ ప్రసంగం మీవాళ్ళ కర్థమవుతుందో కాదో'' అంటూ సందేహం వెలిబుచ్చాడు.


''మీరట్లా అనుకోబాకండి సామీ! మూడు రాత్రుల్లుగా మేం మీ కత వింటూనే వుంటిమిగదా! మాకర్థమైంది మా వాళ్ళకు గాకపోతుందా? సింహానికే అడివైనా ఒకటేగద సామీ!''

శర్మగారు పకాలున నవ్వేశారు. ''చదువు కున్నది స్వల్ప మేనన్నావుగానీ, నీలో మంచి మాటకారి తనముందయ్యా నాయుడూ! ఎలాగైతేనేమి, నా చేత సరేనని అనిపించు కున్నావు, మంచిది బాబూ! అట్లాగే వస్తాను. ఎప్పుడు రావాలో, ఎలా రావాలో చెప్పి వెళ్ళు...''

''ఆ యివరాలన్నీ మనవి చేసే ఎళ్తాము సామీ!'' అన్నాడు నాయుడు.

హరి నారాయణశర్మగారు బుగ్గ అగ్రహారం రావడం అలా






సంభవించింది.

వెంకటాద్రి నాయుడు తనకోసం చేసిన ఏర్పాట్లు శర్మ గారికి సంతృప్తిని కలిగించాయి. హైస్కూలు హెడ్మాస్టరు బదిలీ అయిపోవడంవల్ల ఖాళీగా వున్న యింటికి అన్ని సదుపాయాలూ అమరించి చిన్న టి.బి.లా తయారు చేశాడు. భోజనం చేసి పెట్టడానికి తిరుపతినుంచీ వంట మనిషిని రప్పించాడు. అన్నింటి కన్నా అక్కడి ప్రకృతి సౌందర్యమూ, అక్కడి జనానికి భారత పురాణం పట్లగల మోజు శర్మగారిని అలరించాయి. చుట్టూరా పచ్చటి కొండలు. ఆ కొండల కైవారంలోని లోయలో ఎల్లప్పుడూ పారే ఏరొకటి. దానికటూ యిటూ పైరు పచ్చలు, ఫల వృక్షాలు, లోయ నడుమ ఎత్తుగా పైకి లేచిన మిట్టపైన బుగ్గ అగ్రహారం. ఊరికి వెలుపల చింత తోపులో ధర్మరాజుల గుడి. పెద్ద పెద్ద చింత చెట్లు అక్కడొక వలయం తీర్చి నట్టుగా నిలబడి వున్నాయి. వలయరేఖను తాకినట్టుగా గుడి తూర్పు దిక్కుకు అభిముఖంగా వుంది. పేరుకు గుడే అయినా అది ఒక బండ్ల మిద్దె. తొమ్మిదంకణాల బండ్ల మిద్దెలో మూడింట ఒక భాగం వసారా, మిగిలింది గుడి. గుడిలోపల ద్రౌపదీ సమేతంగా పంచ పాండవుల విగ్రహాలున్నాయి. కొంచెం కేటాయింపుగా శ్రీకృష్ణుని యొక్క, పోతరాజు యొక్క విగ్రహాలున్నాయి. అన్నీ దారు విగ్రహాలు. గుడి బయట దాదాపు ఒక ఎకరా జాగా ఆక్రమించేటట్టుగా కొబ్బరి మట్టలతో పందిరి వేశారు. ట్రాక్టరుతో యిసుక తోలించి, పందిరి క్రింద పరిపించారు. పందిరి కెదురుగా వంద మీటర్ల దూరంలో వీథినాటకానికి రంగస్థలం ఏర్పాటయింది. ఆ వేదికనుంచే కుడి ఎడమలకు అర్థచంద్రాకారంలో గుడారాల లాంటి పాకలు వెలిశాయి. వాటిలో కొన్ని మిటాయి కొట్లుగా, కూల్ డ్రింకు షాపులుగా, నాస్టా అంగళ్ళుగా వినియోగ పడుతున్నాయి. గుడి ముంగిట స్టేజీ పైకెక్కి అక్కడినుంచే దిశాంచలాలదాకా కలయజూచిన శర్మగారికి అదొక అతిలోక రమణీయమైన దృశ్యంగా కనిపించింది. ఆ ఉత్తేజంలో ఆయన వ్యాస భగవానుడూ, కవిత్రయంవారు తనను ఆవహించినట్టుగా పంచమవేద మహాప్రపంచంలోకి జొరబడ్డారు. తొలినాటి కథ భారత ప్రశస్తికే సరిపోయింది. తరువాత మేనకా విశ్వామిత్రం, శకుంతలా దుష్యంతం, భరతుడి జననం, గంగా శంతనుల వృత్తాంతం, భీష్మ ప్రతిజ్ఞ, సత్యవతీ పరిణయం లాంటి ముఖ్యమైన ఘట్టాలను పరామర్శిస్తూ ఖాండవ దహనం దాకావచ్చి, ఆది పర్వాన్ని ముగించేసరికి అయిదు రోజులు పట్టింది. నిన్నటి కథ రాజసూయానికి, శిశుపాల వధకు సరిపోయింది. ఈ రోజు మయ సభ, మాయా ద్యూతాలతో బాటు మాన సంరక్షణం గూడా చెప్పి వుండవలసింది. కానీ ఈ మిట్టను చదునుచేస్తే గానీ, యిక మీదట బాట వేయడం సాధ్య కాదన్నట్టుగా శర్మగారు పాచికలాట దగ్గరే ఆగిపోయారు. సాధారణంగా పౌరాణికులందరు పది నిముషాల్లో దాటుకుపోయే పాచికలాట ఘట్టంతో దాదాపు గంటన్నరపాటు సభను స్తంభీభూతం చేసిపారేశారు.

* * *

"చెప్పండి సామీ!"

శర్మగారు తిరిగి వచ్చి వాలు కుర్చీలో సేద దీరగానే అడిగాడు వెంకటాద్రి నాయుడు.

"ఏమయ్యా నాయుడూ! నీకు జనమేజయుడెందుకు సర్పయాగం చేశాడో తెలుసా?"

"అయ్యో, తెలియకేం సామీ! వాళ్ళ నాయన్ను పామే గదా కాటేసింది. అందుకన్జెప్పి భూమ్మీద పామనేమాట లేకుండా జేయాలని..."

"అవును. అట్లాగే నాకున్నూ జూదమంటే గొంతుక దాకా కోపం వుందయ్యా! దేశాన్ని పట్టి పీడిస్తున్న అనర్థాలు చాలా వున్నాయనుకో! వీటిలో ఈ జూదగొండి మనస్తత్వానికి మొదటి స్థానం యివ్వాలని నా అభిప్రాయం. మానవుడిలో సహజంగా కొన్ని బలహీనతలుండవచ్చు. వాటిని తొలగించి అతణ్ణి ఉత్తమాదర్శాలతో సత్పౌరుణ్ణిగా తీర్చి దిద్దవలసిన బాధ్యత కుటుంబం, విద్యాలయం, ప్రభుత్వం లాంటి సంస్థలపైన వుంటుంది. అలాంటిది కంచే చేను మేస్తుంటే, మన గోడు మనమెవరికి చెప్పుకోగలం? 'ఓరి దౌర్భాగ్య మానవుడా! నువ్వు కష్టపడి, చెమటోడ్చి, ఎముకలు విరిచి నీతిగా, న్యాయంగా జీవితంలో ఉన్నతికి వెళ్ళడం కలలోని మాట. నీచేతనైనంతలో నువ్వందుకోసం ఏవైనా అడ్డు దోవలు అన్వేషించుకో!' అన్న దగాకోరు ప్రబోధాన్ని ప్రత్యక్షంగా గాకపోతే పరోక్షంగా, మాటల్లోగాకపోతే చేతల్లో మీరు చేస్తున్నారా, లేదా అని నేను ప్రశ్నిస్తున్నాను. దీని పేరేమిటో తెలీదటయ్యా నీకు! లాటరీ. హర్యానా లాటరీ, ఆంధ్రప్రదేశ్ లాటరీ. మణిపూర్ లాటరీ, మేఘాలయ లాటరీ...అసలు లాటరీ కొట్టని, కొట్టించని రాష్ట్రమేదుంది చెప్పు! వేలకొద్ది, లక్షల కొద్దిమంది చేతులు కాల్చుకుంటే ఎవడో ఒకడు లక్షాధికారైపోతాడట! ఈ పద్ధతిమీద వీళ్ళు దేశాన్ని సుఖాలసీమగా, సంతోషాల శాలగా, రాముడేలిన రాజ్యంగా దిద్ది తీర్చేస్తారట! ఏమయ్యా నాయుడూ! నీకు మతి పోవడం లేదా ఈ మాటలు వింటుంటే! నాకు పోతోందయ్యా బాబూ! నా తమ్ముడొకడు ఈ లాటరీ పిచ్చిలో పడి కొంపను బుగ్గి చేసుకున్నాడు..."

"అయ్యో అట్లనా సామీ! మీరింత తెలిసినోళ్ళు, బుద్ధి చెప్పక పోతిరా?" పరితాపాన్ని ప్రకటిస్తూ అడిగాడు నాయుడు.

"బుద్ధి చెప్పిన వాళ్ళందరూ వాడికి బద్ధ శత్రువులై పోయారు. లాటరీ టికెట్లు కొనేవాళ్ళు, కొనుక్కొమనే వాళ్ళు ఆత్మ బంధువులైపోయారు. దేవుడు దయదలచి తనకొక అయిదు లక్షల రూపాయిల మొదటి ప్రయిజు నిచ్చేస్తే, అందులో రెండు లక్షలు పెట్టి దర్జాగా ఒక మేడ కట్టేసుకుని, మిగిలిన మూడు లక్షలూ ఫిక్సెడ్ డిపాజిట్లు క్రింద పడేసి, తాను చేస్తున్న పనికి మాలిన ఉద్యోగం వదిలిపెట్టెయ్యాలని వాడు కలలు గన్నాడు. ఈ పరమాశయం ముందు వాడి పాలిటికి భార్యా బిడ్డల శ్రేయస్సు, ఉద్యోగ ధర్మం, తన స్వంత సుఖం మొదలైన వన్నీ అత్యల్పమైన, అతి హీనమైన విషయాలుగా తోచాయి. ఎన్ని టిక్కెట్లు కొన్నాడో, ఎంత డబ్బు వెచ్చించాడో — ఎప్పుడూ అప్పుల్లో మునిగి తేలేవాడు. టికెట్లు కొనడం ఒక ఎత్తయితే, వాటి ఫలితాల కోసం వేచి చూడడం ఒక ఎత్తు. మావాడుద్యోగం చేస్తూవుండిన వూరికి దినపత్రికల్ని తీసుకొచ్చే బస్సు అర్ధ రాత్రప్పుడెప్పుడో వచ్చేది. అప్పటికి వీడు బస్ స్టాండులో హాజరు! ఇలాంటి లాటరీ పిచ్చోడే యింకొకడు మా వాడికి స్నేహితుడుగా దొరికాడట! ఒకసారి ఏదో మాటా మాటా వచ్చి అతగాడు వీడితో 'తల క్రిందులుగా పెట్టి తపస్సు చేసినా నీకీ జన్మలో ఫస్టు ప్రయిజు రాదు పోరా' అంటూ ఎద్దేవా చేశాడట! దాంతో వైరాగ్యం పుట్టుకొచ్చి మావాడు గడ్డాలు, మీసాలు పెంచేశాడు. సమయానికి ఆఫీసులో వాడి జీతానికి సంబంధించిన బకాయి డబ్బులేవో చేతికొస్తే ఒకానొక బంపర్ లాటరీలో సీరిస్‌కి వందేసి చొప్పున టికెట్లు కొనేశాడు."

"ఇన్ని కొనినా ప్రయిజు రాలేదా సామీ?"

"ఒకే ఒక అంకెలో రెండో ప్రయిజు రెండు లక్షల రూపాయలు-తప్పిపోయింది."

"అయ్యయ్యో..."

"ఆ దెబ్బకెలాగైనా మావాడు తట్టుకునే వాడే. కానీ ఆ ప్రయిజు కాస్తా నీకు ప్రయిజు రాదు పొమ్మని మా వాణ్ణి ఎద్దేవా చేశాడే, ఆ వ్యక్తి కొచ్చేసింది. మయ సభలో దుర్యోధనుడిలాగా మావాడు అవమానాగ్నిలో దహించుకు పోయాడు. ఆనాటి నుంచీ అయిపులేడు. ఏమైపోయాడో, ఎక్కడున్నాడో తెలియదు. పోలీసులకు రిపోర్టిచ్చాం. మనుషుల్ని పెట్టి వెదికించాం. పత్రికల్లో ప్రకటనలు వేయించాం. ఫలితం శూన్యం"

"......"

"పోనీ ప్రయిజొచ్చిన వాడైనా బాగు పడ్డాడా అంటే అదీ లేదు. ప్రయిజు చీటీ జేబులో పెట్టుకుని అతగాడు చౌనుకు వెళ్ళాడు. బ్యాంకులో దాన్ని డిపాజిట్టు చేయడం గురించి పదిమందితోనూ సంప్రదించాడు. ఆపదిమందిలోనూ ఒకడు కన్నులా వుండగానే, కంటి పాపను కత్తిరించే రకం. ఆ నయ వంచకుడు అసలు టికెట్టును కాజేసి, ఒక నకిలీ టికెట్టును వీడి చేతిలో పడేసి, గుట్టు చప్పుడుగా ఉడాయించాడు. జరిగిన మోసం తెలుసుకుని వీడు నెత్తీ నోరు బాదుకున్నాడు. నెల రోజులపాటు పోలీస్ స్టేషను చుట్టూ తిరిగాడు. ప్రయోజనం లేదని తెలిసి రావడంతో అక్కడే ఉరేసుకుని చచ్చాడు..."

"అయ్యో పాపం!"

"ఎవరిది పాపం? నన్నడిగితే ఈ జూదాలు సాగనిచ్చే వాళ్ళదే పాపం. నీ చేతిలో ఆధారముంది. నువ్వు తలచుకుంటే అవినీతిని, అన్యాయాన్ని, అప మార్గాలని అరికట్టగలవు. కానీ నీ కా ఉద్దేశం వున్నట్టు తోచదు. నువ్వు వర్గ విభేదాలు వుండగూడదంటావు. కానీ ఏ వర్గానికి తగిన వ్యసనాన్ని ఆ వర్గానికి మప్పుతావు. పై తరగతి వాళ్ళకి గుర్రప్పందాలు, మధ్య తరగతి వాళ్ళకి లాటరీ టికెట్లు, క్రింది తరగతుల వాళ్ళకి మట్కా ఆటలు. డబ్బున్న వాళ్ళ సంగతి మనకొద్దు! వదిలెయ్! మరి మట్కా జూదం మాటేమిటి? రిక్షావాడు, టీ కొట్టువాడు, పాన్ వాడు, ప్రెస్సులో కంపోజిటరు, మార్కెట్టులో చిల్లర బేరగాడు, హోటల్లో నౌకరు, అంగట్లో పనిమనిషి వీళ్ళందరూ నిలువు దోపిడీ అయిపోతూ వుండడం యిందులోనే గదయ్యా! పగలల్లా సంపాదిస్తారు.



# కాంతి తోరణాలు

నిరాశా నిస్పృహలతో
నీరసించిన మోళ్ళలో
సిరిసంపదలకు దూరమైన
నిరుపేదల ముంగిళ్ళలో
మబ్బు మసక పొరలతో
మలినమైన కళ్ళలో
జడతా తమస్సమాజం
గడలుకొన్న గుండె గూళ్ళలో
కాంతి తోరణాలను
కైసేయాలి
స్నేహమే ప్రాణంగా
జీవించే దీపసుందరి

\- వేముగంటి

సంపాదించిన దాన్ని రాత్రివేళ మట్కాలో పెడతారు. తెల్లారేసరికి నెత్తిన ముసుగేసుకుంటారు. మళ్ళీ సంపాదన, మళ్ళీ జూదం, మళ్ళీ దోపిడీ. ఈ విషచక్రం యిలా తిరుగుతూ వుండవలసిందేనా? ఆగదా?"

"ఏమోసామి! ఆగిపొయ్యేది అనుమానమే!"

"అందుకేనయ్యా నాకు కోపం! జూద గొండి మనస్తత్వం ఒక దారుణమైన అంటు వ్యాధిలా నేల నాలుగు చెరగులా వ్యాపించింది. కార్చిచ్చులా సమాజాన్ని చుట్టుముట్టింది. కర్కోటకుడి కాటుతిన్న నలచక్రవర్తిలా దీని విష దంష్ట్రలు గుచ్చుకు పోవడంవల్ల మానవ సమాజం వికృతమైపోయింది. మనబోటి వాళ్ళం ఊహాలో తప్పితే దీనికి చికిత్స చెయ్యలేం. నా మట్టుకు నేను నా ఊహ ఏమిటో చెబుతాను విను. జనమేజయుడికి మళ్లే సర్పయాగం లాంటి దొకటి నిర్వహించి జూదాలకు రూపకల్పన చేసేవాళ్ళని, ఆడించే వాళ్ళని, ప్రోత్సహించే వాళ్ళని అందులోకి ఆవాహన చెయ్యాలని నా కొక్కొక్కప్పుడు అనిపిస్తూ వుంటుంది."

నాలుగైదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయిన తర్వాత అడిగారు శర్మగారు-"అన్నట్టీరోజు రాత్రి మీ నాటకంలో గూడా పాచికలాడే ఘట్టమేగదూ?"

"అవును సామీ! తాము తప్పకుండా జూడాల. చెప్పివాను గదా! ఆడేవాళ్ళు కంగుందోళ్ళు. భారతనాటకాలాడడంలో వాళ్ళది దిక్కులకు పేరు..."

"చూడకపోయినా వాళ్ళ పాటా మాటా వింటూనే వున్నానేలేవయ్యా! కొండలదరి పోయే టట్టుగా నువ్వు మైకులు పెట్టించేశావు గదా! రేడియోలో విన్నట్టే వుంది. అయినా ఒకసారి ప్రత్యక్షంగా చూస్తేగానీ అనుభవం పూర్తిగాదు. ఆ ముచ్చటగూడా తీర్చుకుందాంలే! నువ్వు తొమ్మిదిన్నరకల్లా వచ్చెసెయ్! ఓ అరగంటసేపు అక్కడుండి తిరిగొచ్చేద్దాం..."

"అట్లనే సామీ!" అంటూ పైకి లేచాడు వెంకటాద్రి నాయుడు.

* * *

చిమ్మ చీకటి తెరలతో ఒక బ్రహ్మాండమైన గుడారం వేసి అందులోకి వెలుగు వెల్లువలు పరవళ్ళు దోలినట్టుంది భారతం మిట్ట. గుంజలకు, వాసాలకు, చెట్ల కొమ్మలకు వ్రేలాడుతున్న కరెంటు దీపాలు వెల్తురు తటాకంలో తమ్మి మొగ్గల్లా వున్నాయి. అవిరామమైన, అర్థహీనమైన, అయోమయమైన జన ఘోషతో ఆ ప్రదేశం పున్నమినాటి సముద్రంలా ఝూర్ణిల్లిపోతోంది. అయిదారు మైళ్ళ పరిధికి లోబడిన పల్లెల్లో నుంచీ తండాలు తండాలుగా తరలి వచ్చిన జనం దుప్పట్లు గోనె పట్టాలు పరచుకుని ఆ మైదానంలో బైఠాయించేశారు. అక్కడ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఆనందం చిందులు త్రొక్కుతోంది. కేకలు బాకాల్లా వినిపిస్తున్నాయి. నవ్వులు పువ్వులు రువ్వినట్టుగా చెలరేగుతున్నాయి. వెంకటాద్రినాయుడు హరినారాయణశర్మగారిని తీసుకొచ్చి గుడి ముంగిట సుఖాసనం వేయించే సరికి జన సందోహానికటు వైపున యక్షగాన ప్రదర్శనం గూడా ప్రారంభమైపోయింది. నిలువంగీ వేసి, చమ్కీ జుబ్బాతొడిగి, మెడకు రుమాలు చుట్టి, నడుము పట్టీకి పిడి చెక్కి, చేత బెత్తం పట్టుకున్న చోపుదారివాడు రంగంపైకి ప్రవేశించి సభికులకు బహుపరాక్ పలుకు తున్నాడు--


"హెచ్చరికతో నుండుడీ!

సభికులార!

హెచ్చరికతో నుండుడీ!
హెచ్చరికతో నుండు డిచ్చలోపల మీరు
అచ్చుగా సభ జేరనదిగో వచ్చెనురాజు
అదిగో వచ్చెను రాజు
ఇదిగో వచ్చెను రాజు..."

నిజంగానే రాజుగారు వస్తున్నట్టు తోపింపజేస్తూ రంగం పైన ఆ మూలకు ఈ మూలకు పరుగులు దీసి తెర తొలగించి చూపులు సారిస్తున్న చోపు దారిని చూస్తుంటే శర్మగారికి నవ్వాగింది కాదు. ఆయన ఫక్కున నవ్వేస్తూ "భలే! భలే! పాత్రలో జీవిస్తున్నాడయ్యా మీ చోపుదారి" అన్నారు.

"అప్పుడే ఏం జూసినారు? అద్దాల మునసామిరావాల, అప్పుడు జూడాల!" అన్నాడు వెంకటాద్రినాయుడు.



"అద్దాల మునసామా! వాడెవరయ్యాబాబూ? భారతంలో అలాంటి వాడెవడూ లేడే?"

"అద్దాల మునసామంటే దుర్యోధన మహారాజు పార్టు కట్టేవాడు సామీ! కండ్లకు చలవద్దాలు పెట్టుకోని, చెమ్కీ కోటు తొడుక్కోని, ముంజేతికి వాచీ కట్టుకోని, పాదాలకు షెడావులేసుకోని స్టేజీపైకొచ్చేసివాడంటే నిద్రపోయే వాళ్ళు కూడా లేచి కూచోవాల..."

శర్మగారు ఆలోచనలో పడ్డారు.

—కళ్ళకద్దాలు పెట్టుకుని, రిస్టు వాచీ కట్టుకున్న దుర్యోధనుణ్ణి వ్యాస మహర్షి గూడా ఊహించి వుండడు! అయితే ఒకటి. కాలానుగుణ్యంగా కళా స్వరూపం మారిపోతూ వుంటుంది. ప్రస్తుతమిక్కడ ప్రదర్శిత మవుతున్న భారత నాటకానికి సంబంధించి పాత్రల ఆహార్యంలో ఔచిత్యం కొరవడినా, ఆంగికం ఎట్లెట్లుగా వున్నా, వాచికంలో అప శబ్దాలు దొర్లినా అట్టే యిబ్బంది లేదు. మహా భారత సందేశం పట్ల ప్రజలు ప్రభావితులవుతూ వస్తే చాలు.

శర్మగారి ధ్యాస నాటక ప్రదర్శనం నుంచీ వైదొలిగి, జన సందోహం వైపు మళ్ళింది. రంగస్థలానికటూ, యిటూ వ్యాపించివున్న అంగళ్ళ ఎదుట జనం అడ్డుగోడలా నిల్చు న్నారు. కాగుతున్న ఆ బాణలి లోనుంచీ వేడి వేడిగా దిగిన తినుబండారాలను వాళ్ళలో కొందరు ఊది ఊది తింటున్నారు. టీ గ్లాసులు ఎడ తెరపి లేకుండా చేతుల మారుతున్నాయి. ఆకులూ వక్కలూ, బీడీలు, సిగరెట్లు బెలూన్లు,వత్తుపీ స్టీలువీ పాత్రలు, రిబ్బన్లు మొదలైన వాటికి బాగా గిరాకీ తగిలి నట్టుం ది. తీర్థాలు, తిరణాలు జరిగినప్పుడు ఇలా బేరసారాలు, కొనుగోళ్ళు జరగడం మామూలే. కానీ శర్మగారికొకందుకు కాస్త విస్మయం కలిగింది. ఎదురుగా కనిపిస్తున్న బజారు కవతల అంతకంటే ధగద్ధగాయమానమైన దీప కాంతిలో అంతకంటే పెద్ద పెద్ద పాకలు కొన్ని కానవస్తున్నాయి. కట్టగట్టుకున్నట్టుగా అటువైపు వెళ్ళివస్తున్న జనాన్ని బట్టి చూస్తే అక్కడేదో గొప్ప విశేషమే జరుగుతున్నట్టు తోస్తూ వుంది.

"ఏమయ్యా వెంకటాద్రినాయుడూ! అదిగో, అక్కడున్నాయే పెద్ద పాకలు, అవిగూడా అంగళ్ళేనా?" శర్మగారు ప్రశ్నించారు.

"అవి అంగళ్ళెందుకవుతాయి? లంగరు, పిన్ బోర్డు, చింత గింజలాట, యింకా లోపలా బయటా..."

"అవంతా ఏమిటయ్యా బాబూ?"

"మీ రెప్పుడూ చూళ్ళేదా?"


"నువ్వు చెప్పిన మాటల కర్థమేమిటో బోధపడడంలేదే! చూశానో, లేదో ఎలా చెప్పగలను?"

"ఇంత కూ అదేమైనా చూడదగిన తతంగమేన టయ్యా నాయుడూ?"

"రండి సామీ, చూస్తే పోలా!"

వెంకటాద్రినాయుడు ముందుకు నడిచిన కొద్దీ జనం పాయలుగా చీలిపోయి దారి కల్పించారు. అతడు శర్మగారిని తీసుకెళ్ళి నిల్చోబెట్టిన చోట బాగా ఎరువు పోసిన కయ్యలో నారు వచ్చినట్టు జనసాంద్రత మరింత దట్టంగా వుంది. పందిరి పెట్టినట్టున్న చింత చెట్లకింద పది పన్నెండు పెట్రొమాక్సు లైట్లు వెలుగుతున్నాయి. ఒక్కొక్క దీపానికీ సమీపంలో ఒక చక్రం, అది జానెడెత్తులో భూమికి సమాంతరంగా తిరుగుతోంది. వాటి చుట్టూ జనం పోగై పోయారు.

"చూడండి స్సార్! మోసం లేదు. మాయ కాదు. అదృష్ట ప్రయిజు. ఏనుగు, ఒంటె, గుర్రం, ఆవు, సింహం- అయిదు బొమ్మల్సార్! మీరు కోరిన బొమ్మపైన డబ్బు కట్టండి స్సార్! మీరు కట్టిన బొమ్మ దగ్గర చక్రం నిలిస్తే పావలాకు పావలా, అర్థ రూపాయకు అర్థ రూపాయ, రూపాయకు రూపాయ, అయిదుకయిదు, పదికి పది. అదృష్ట ప్రయిజు సార్! రండి స్సార్! రండి స్సార్! కట్టండి స్సార్!"



ఆటనడిపే వ్యక్తి ఉరుము వురిమినట్టుగా మెగాఫోనులో అరుస్తున్నాడు. వడగండ్లు రాలినట్టుగా డబ్బులు రాలు తున్నాయి. చక్రం గిర్రున తిరిగి తిరిగి, క్రమంగా మందగించి చివరికొకచోట ఆగిపోతోంది. సూచిక ఏ బొమ్మ పైన నిలిచిందో ఆ బొమ్మపైన పందెం కట్టిన వాళ్ళకు రెట్టింపు డబ్బు లభిస్తోంది. మిగిలిన బొమ్మలపైన పడివున్న డబ్బులన్నీ ఆటగాడి డబ్బాలోకి వెళ్ళిపోతున్నాయి.

"లంగరంటే యిదే సామీ! లేదంటే బొమ్మలు మారొచ్చు. రంగులు మారొచ్చు. ఆటాడే తరహా మాత్తరం ఒకటే!"

"ఇదేనా నాయనా లంగరంటే!" మాతిలో గొంతుకలా శర్మగారి కంఠస్వరం చాలా హీనంగా వినిపించింది. "పరవా లేదు. మాయా బజారులాగే వుంది. మరైతే ఆ పాకలో ఏం జరుగుతోంది బాబూ?"

"పిన్ బోరుడ్డు జరిగే దక్కడ్నే సామీ!" నాయుడు ఆ పాకవైపు దారి తీశాడు.

కాళ్ళెంతగా వెనకాడుతున్నా శర్మగారతణ్ణి వెంబడిం చారు. పిన్ బోర్డు పాకలో సైతం ఇసుక వేస్తే కింద రాలేటట్టు లేదు. జన సమూహం తలలపైనుంచీ చూస్తే పాక కటువైపు తడికె నానుకున్నట్టుగా ఓ చక్రం టేబిల్ ఫ్యానులా తిరుగు తోంది. ఆగినప్పుడు మాత్రమే దానిపైన వేసిన రంగులు స్పష్టంగా కనిపిస్తాయి. తిరుగుతున్నప్పుడు అవన్నీ అలుక్కు పోయినట్టున్నాయి. చెక్కకానించిన త్రీవైపు కత్తులు విసిరి నట్టుగా, పందెం కట్టిన వాళ్ళు చక్రం పైన గుచ్చుకునే టట్టు గా పిడి సూదులు విసురుతున్నారు.

ఎరుపు రంగుపైన అయిదు రూపాయిలు పందెం ఒడ్డి ఒకతను మూడు సూదులు విసిరాడు. రెండు సూదులు తెలుపు రంగులో గుచ్చుకున్నాయి. ఒకటి పసుపు రంగులో గుచ్చుకుంది. రెండు నిమిషాల వ్యవధిలో అయిదు రూపాయిల నోటు ఆట నడిపేవాడి బొక్కసంలో చేరిపోయింది.

"కాయ్ రాజా కాయ్! పందెం కాయ్! మీరు ఒడ్డిన రంగుపైన ఒక సూది గుచ్చుకుంటే రెట్టింపు, రెండు గుచ్చుకుంటే రెట్టింపుకు రెట్టింపు, మూడు గుచ్చుకుంటే ఎనిమిదింతలు, ఒక రూపాయి పెడితే ఎనిమిది రూపాయిలు, అయిదు పెడితే నలభై, పది పెడితే ఎనభై. కాయ్ రాజా కాయ్!"

"ఏమయ్యా నాయుడూ! మిగిలిన పాకలన్నీ గూడా యిలాంటివేనా?" శర్మగారు దీనంగా ప్రశ్నించారు.

"అయ్యో, ఇవిటికీ అవిటికీ పోలికేముంది సామీ? అవి శానా పెద్దాటలుగదా! అదో, ఆ కొట్టంలో జరిగేదే చింత గింజలాట..."

ఆ పాకలో నుంచీ మెగా ఫోను ద్వారా మాటలు వినిపిస్తున్నాయి. అయ్యా, నలభై అయిదు...పన్నెండు... ఇరవై తొమ్మిది...నాలుగు...ముప్పై మూడు..."

ఆటాడే వారిలో నుంచీ ఒకడు బిగ్గరగా అరిచాడు- "ఉండుండు. అయిపోయింది. గేమ్, గేమ్!"

నాయుడు వివరణ కొనసాగించాడు-"ఒక్క సారిగా ఇరవై నాలుగు మంది ఆడొచ్చు సామీ ఆ ఆట! నాష్టా అంగడిలో మాదిరిగ్గా కూచునే దానికి బెంచీలు. అవిటి ముందర ఆటాడే దానికి కొయ్య పలకలూ వుంటాయి. ఆ పలకం మీద ఇరవై నాలుగు చదరాలుంటాయి. చదరానికి ఎనిమిదెనిమిదుల అరవై నాలుగు గళ్ళుంటాయి. ఆ గళ్ళల్లో చెల్లా చెదరుగా నంబర్లుంటాయి. ఆట నడిపే వాడు డబ్బాలోనుంచీ చేతికొచ్చిన అట్ట ముక్క పైకి తీసి అందుపైన వేసింది ఫలానా నంబరని బలంగా అరుస్తాడు. ఆటాడేవాళ్ళు ఆ నంబర్లపైన చింత పిక్కలు పెట్టుకొంటూ వస్తారు. నిలువుకుగానీ, అడ్డంగా గానీ, మూలలకు గానీ వరసగా ఎనిమిది గళ్ళల్లోకీ చింత పిక్కలొచ్చేస్తే, వాడు గెలిచినట్టు! ఆటకు రుసుము ఒక రూపాయైతే గెలిచినోడికి పజ్జెనిమిది రూపాయలొస్తాయి..."

"మిగిలిన ఆరు?"

"తెలిసిందే గదా! మిగిలిన ఆరూ కమీషన్ కింద ఆట నడిపే వాడే ఎత్తుకుంటాడు..."

"చాల్నాయనా! చూచిందీ, వినిందీ చాలు. కొద్ది కొద్దిగా తల నొప్పి ప్రారంభమైంది..."

"ఇంకా ఒకాట బాకీ వుండిపోయింది సామీ! వుండే వాట్లో పెద్దాట అదే! లోపలా, బయటా అంటారు దాన్ని! ఇస్పేటాకుల్తోనే ఆడ్తారు లెండి! అది ఇద్దరిద్దరే ఆడే ఆట. కావలిస్తే చుట్టూ వుండే వాళ్ళు పై పందాలు కట్టుకోవచ్చు. ఒకడు ముందుగా కట్టలోనుంచీ ఒకాకు కోస్తాడు. అది జాకీ అనుకోండి! మళ్ళీ వాడి కొకటి, వీడి కొకటి లెక్కన ఆకులు పంచుకుంటూ వస్తారు. ఎవరికి ముందుగా జాకీ వస్తుందో వాడిదే ఆట! ఒక నిముషంలో నూర్రూపాయిలు పోయినా పోవచ్చు, వచ్చినా రావచ్చు అందులో..."

శర్మగారు గిరుక్కున వెనుదిరిగి రహదారివైపు నడవ సాగారు. ఆయనలా రివ్వున వెళ్ళి పోతుండడం చూచి

వెంకటాద్రినాయుడు నిష్వేర పాటులోనయ్యాడు. "ఏమయింది సామీ? తల నొప్పి ఎక్కువైపోయిందా?" అంటూ వడి వడిగా వెళ్ళి ఆయన్ను కలుసుకున్నాడు.

గాలి దెయ్యమొకటి వెన్నంటి తరిమినట్టుగా, నిలువరించుకోడం అసాధ్యమైపోయి గాలివానలో కొట్టుకుపోతు న్నట్టుగా, శర్మగారు రోడ్డు దాకా వచ్చేశారు. అక్కడొకచోట తటాలున ఆగి, వెనుదిరిగి చూశారు.

"తలనొప్పి జాస్తిగా వుంటే చెప్పండి సామీ! మాత్తర తెచ్చి పెడ్తాను" అన్నాడు నాయుడు.

"తలనొప్పి సంగతలా వుంచు. నాకొక సందేహం..."

"అడగండి సామీ!"

"నువ్వు ముఖ్య ధర్మకర్తవు గదా! మహా భారత యజ్ఞంలో ఈ ఆటలన్నీ జరిపించడంలో నీ ఉద్దేశం?"

తెల్లబోయినట్టుగా బదులిచ్చాడు నాయుడు.

"ఏముంది సామీ! అది లేకపోతే యిది లేదే! ఆ సంగతి తెలియదా తమకు? మేమేం వాళ్ళని పూటికే ఆడుకోనిస్తామా? అప్పుడాలా అనుకున్న ప్రకారం రుసుమిచ్చుకోవాలి. బంగరు చక్రానికి రోజు ఒకటింటికి పది రూపాయిలు. పిచ్చోడుడుకు పజ్జెనిమిది దినాలకూ జేరి రెండు వేలు. వంద గింజలాట కాంట్రాక్టు నాలుగు వేలు. ఇస్పేటాడుం కాంట్రాక్టు ఏడున్నర వేలు. పోతే మిగిలిన టీ కొట్లు అంగళ్ళు అన్నిటికీ కలిపి ఇంకొక రెండు మూడు వేలు. అంత మొత్తం ఖర్చై వేలయినా ముట్టకపోతే మేమింత భారీ పని నెత్తికేస్కో విధాయకమెట్లా? నాటకం జట్టే ఆరుకుటుంబాల వాళ్ళుండిపోయిరి. వాండ్లకు దినవారీ భోజనాల ఖర్చుకే నూర్రూపాయలు కావలిసొచ్చె. వాండ్లకివ్వాల్సిన కట్నం పదువేలు. ఇక్కడ కొట్టాలు వేసే దానికి, గుంజలకని వాసాలకని, కొబ్బరి కేతులకని రెండు వేలు అమ్ముకోవల్సి వచ్చె. కరెంటు చార్జీలకెంత లేదన్నా ఒక వెయ్యి కావలిసొస్తుంది. ఇంకపోతే పోలీసోళ్ళు చూసీ చూడనట్టుండాలంటే వాండ్లకేదో ముట్టజెప్పొద్దా? కడాపటికి మీరుండి పోతిరి. చేటంత ఆవు అడుగుతుండా వచ్చినందుకు వీలున్న కాడికీ మిమ్మల్ని గూడా సంతోష పెట్టే పంపాలగదా!..."


అప్పుడే పుట్టిన పిల్ల ప్రపంచాన్ని చూసినట్టుగా వెంకటాద్రినాయుడు మాట్లాడుతున్నంతసేపూ అతడి ముఖంలోకే చూస్తూ వుండిపోయారు శర్మగారు. తనను ఆవరించుకున్న దిగ్భ్రాంతి ఏదైతే వుందో అందులో నుంచీ ఆయన తేరుకోడానికి కొద్ది నిమిషాలు పట్టింది. ఆ తరువాత ఆయన ప్రపంచ మంతట్లోనూ తానొక్కడే ఏకాకైపోయినట్టు తల వంచుకుని వక్కా ఊరివైపున నడక సాగారు.

నకులుడు ధర్మరాజును హెచ్చరిస్తూ పాడుతున్న పాట వెనక వైపునుంచీ ఆయన్ను తరుముకొస్తోంది.

"వలదు వలదోయన్న పాచికలాట
వలదు కలుగునుకీడు,
విల-హారమును వీడు
వలదు వలదోయన్న పాచికలాట
ధరణి వేమంపల్లె ధాముని సాక్షిగా
వలదు......"

* * *

స్టీలు మరచెంబు నిండుగా ఆవు పాలు పట్టించుకుని, మరునాటి ఉదయం ఆరు ఆరున్నరకల్లా వెంకటాద్రి నాయుడు భాగవతారుగారి విడిదికి చేరుకునేటప్పటికి ఆ యిల్లెందుకో బోసిపోయినట్టు కన్పించింది. 'సామీ, సామీ' అంటూ పిలిచి చూశాడు. బదులు లేదు. గుమ్మంవైపు చూశాడు. అక్కడ శర్మగారి పాదరక్షలు లేవు. గది తలుపు



[illegible] బట్టలు తెమ్మన్నట్టు చూసి తెలు [illegible]పోయే సరికి నాయుడి ఒళ్ళంతా [illegible] చెమటలు పట్టేసింది.

భాగవతారుగారు విడిదిలో కనిపించలేదన్న వార్త నిమిషాల్లో ఊరంతా ప్రాకిపోయింది. మరి కొద్దిసేపటికి ఊరు పూరంతా అక్కడ ప్రోగైపోయింది.

పది మందీ పది రకాలుగా ఊహాగానాలు చేస్తుండగా అప్పాజీరెడ్డి అలమరాలోనుంచీ ఓ కాగితం ఊవరికి తీశాడు. "ఏందిది? చీటీ మాదిరిగా వుందే!" అంటూ పరిశీలనగా చూసి "సామికాని పెట్టిపోయిందిగానే వుందే!" అంటూ చిక్కరించాడు.

"ఏం రాసిపెట్టినారో చదవ్వయ్యా తండ్రీ" ఆక్రోశించి నట్టుగా అడిగాడు వెంకటాద్రినాయుడు.

అప్పాజీరెడ్డి ప్రారంభించాడు-" మిత్రుడు శ్రీ వెంకటాద్రినాయుడికి ఆయురారోగ్యాభివృద్ధిగా దీవించి వ్రాయు నది..."

"దీవెనొకటే తక్కువైంది" వెంకటాద్రినాయుడు గొణుక్కున్నాడు.

అప్పాజీరెడ్డి కొనసాగించాడు-"నీకు తెలుసో తెలియదోగానీ వట్టి వాదస్తపు మనిషంటూ నాకొక కితాబు కద్దు. ఆ మాటా నిజమే! మంచో చెడో జీవితం పట్ల నాకు కొన్ని పట్టింపు లున్నాయి. అనేక కారణాలవల్ల ఈనాడు మానవ సమాజం అస్తవ్యస్తంగా తయారైంది. ఏ రంగంలో చూసినా చెప్పే మాటలకూ, చేసే చేతలకూ పొంతన కనిపించడం లేదు. రాజకీయాల్లో నిజాయితీ కొరవడింది. అవినీతి పరులు నీతిని బోధిస్తున్నారు. నూతన నిర్మాణాలే కూలిపోతున్నాయి. ఆహారంలో, ఔషధాలలో కల్తీ బలిసింది. చదువు అంగడి సరుకైపోయింది. సమస్త కళలూ ఫక్తు వాణిజ్య వస్తువులుగా పరిణమించాయి. రక్షించవలసిన వాళ్ళే ప్రజాక్షేమాన్ని భక్షిస్తున్నారు. మంచివాడు అప్రయోజకుడుగా గణించబడుతున్నాడు. పరమ దుర్మార్గుడు సభా పూజ్యుడైపోయాడు. ఈ అవక తవకల్ని అరికట్టే శక్తి మనకు లేకపోయినా, వీలైనంతలో మనం మన చిన్న గొంతుకలో వీటిపట్ల అసమ్మతి తెల్పవచ్చునని నా విశ్వాసం. జీవితం ప్రహసనంగా రూపొంది వుండవచ్చుమగాక! కళ్ళప్పగించుకు ప్రేక్షకులంగాక తప్పదేమోగాని, మనం అందులో పాత్రలం కానక్కరలేదు. జూదంవల్ల కలిగే అనర్థాన్ని, ఎలుగెత్తి ఘోషించే మహా భారతాన్ని ఇతిహాసాన్ని పురాణంగా చెప్పించుకోడానికి, నాటకంగా ఆడించుకోడానికి మళ్ళీ అదే జూదాన్ని ఆధారంగా చేసుకుంటున్నారని నాకు తెలియదు. ఈ పద్ధతి పట్ల నా అయిష్టాన్ని ప్రకటించడానికి నాకు స్ఫురించిన మార్గం ఒకటే. ఉదయం అయిదు గంటలకు యిక్కడినుంచి బయలుదేరే మొదటి బస్సులో నేను వెళ్ళిపోతున్నాను. ఒకే అభ్యర్థన. దయచేసి నన్ను వెంటాడవద్దు. నా పాటుకు నన్ను వదిలిపెడితే చాలు. అదే పదివేలు. ఇట్లు - హరినారాయణశర్మ "

"ఎంత ఎదవపని చేసినావయ్యా అప్పాజీరెడ్డీ! బుద్ధిలేక సామిని నాటకానికి పిల్చుకోని పోతివి గదయ్యా! నట్టేట ముంచేసినాడు గదయ్యా మహానుభావుడు!" వెంకటాద్రి నాయుడు కుప్ప లా కూలబడిపోతూ అన్నాడు.

"ఏందోలే వెంకటాద్రన్నా! అరతం పరతం లేకుండా ఒక జాబురాసిపెట్టిపోయినాడు. అన్నం దినరా ఎర్రినాగన్నా అంటే ఏలు కొరికినట్టుంది ఈయన యెవ్వారం! సర్లే, అయిపోయిన పెండ్లికి మేళాలెందుకు? ఇంక జరగాల్సిందేమో చూడెంచు" అన్నాడు అప్పాజీరెడ్డి.

"ఒద్దు నాయినా ఒద్దు!" జోడించిన చేతుల్ని తలపైకెత్తి పట్టుకుంటూ అన్నాడు వెంకటాద్రినాయుడు-"నాకీ పెద్దరికమూ ఒద్దు, ఆ గుడి మనియమూ ఒద్దు. ఓపినంత కాలం చేసినాను. ఇందులో ఏందో పితలాటకం వుండేటట్టు సామి చెప్పిపోయినాడు. ఆయనకు దెలియుందా! మీకు పుణ్ణెముంటుందిగానీ నన్నొదిలి పెట్టేయండి. ఇకమీదట మీరెవ్వరైనా ముందు నిలబడి చేసుకోవల్సిందే" అన్నాడు వెంకటాద్రి నాయుడు.

సీతమ్మ వారిని వెదకడానికి సుగ్రీవుడు వేగరులను పంపినట్టుగా అప్పాజీరెడ్డి అప్పటికప్పుడు పది పన్నెండు మందిని ప్రోగుచేసి నలువైపులకూ ఉరికించాడు. ఏ హనుమంతుడి పూనిక ఫలించిందోగానీ, మధ్యాహ్నం ఒంటిగంట బస్సులో పూల రంగడిలా దిగేశాడు శ్యామసుందర భాగవతారు. బస్సు దిగిన వెంటనే అతడు విడిదిలోకి వెళ్ళి ముఖమండలం మెరిసిపోయేటట్టు పౌడరు పట్టించాడు. గిరజాలకు సంపంగినూనె తగిలించాడు. బట్టలకు అత్తరు దట్టించాడు. ఘుమ ఘుమాయింపుల బరాబరులు పలుకుతుండగా వేదికపైన అడుగు పెట్టాడు. అరమోడ్పు కన్నుల పారవశ్యాలతో, పెదవి చికిరింపుల విలాసాలతో, కులుకు బెళుకుల శృంగార విభ్రమాలతో సభను సమ్మోహితం చేసేశాడు. కథ ప్రారంభించిన పదిహేను నిమిషాలకల్లా సమయం గాకపోయినా, సందర్భంరాకపోయినా 'కడవెత్తుకొచ్చింది కన్నెపిల్ల, అది కనబడితె చాలునా గుండె గుల్ల' అంటూ తాండవ హేల ప్రారంభించాడు. ఈలలతో, చప్పట్లతో, వన్స్‌మోర్లతో పందిరి దద్దరిల్లిపోయింది. అంతటితో అతడి ఉత్సాహం అవధులు దాటింది. శర్మగారి పురాణ ప్రవచనానికి వచ్చిన జనం వేరు, ఇప్పుడు వస్తున్న జనం వేరు అన్న వాస్తవాన్ని అటుంచి చూస్తే, ఇప్పుడంత కన్నా ద్విగుణీకృతంగా, త్రిగుణీకృతంగా వచ్చి మూగిపోతున్నారని చెప్పడానికి సందేహించనక్కర్లేదు. బుగ్గ అగ్రహారంలో మహా భారత యజ్ఞం నిర్విఘ్నంగా, నిరాఘాటంగా సాగిపోతూ వుంది.